


పైపులైనుకు మరమ్మతులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
నగరంలోని ఊటగెడ్డ వద్ద ప్రధాన పైపులైను లీక్ కావడంతో సిబ్బంది యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపడుతున్నారు. పైపులైను లీక్ అయిందన్న విషయం తెలిసిన వెంటనే కమిషనర్ పి.నల్లనయ్య స్పందించి, సిబ్బందిని అక్కడకు పంపించారు. ప్రధాన పైపులైన్ మరమ్మతుల కారణంగా అవేదపల్లివారి వీధి, కమ్మ వీధి, కొనిశ వీధి, కోరాడ వీధి, తుపాకుల వీధి, కాటవీధి,చిక్కాల వీధి, మేదర వీధి, కంటుభక్త వారి వీధి, లంక వీధి, రాజీవ్ నగర్ కాలనీలలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మరమ్మతులు పూర్తయిన వెంటనే ఆయా ప్రాంతాలకు నీటి సరఫరా చేపడతామని అధికారులు తెలియజేశారు.



వేపాడ.. తడిసిన వరిచేను

బొబ్బిలి.. తడిచిన వరిపంటను చూపిస్తున్న మహిళా రైతు

మెల్లగా ముంచేసింది

తడిసిముద్దయిన వరిచేను ● ఫెంగల్ తుపాను ప్రభావంతో అపార నష్టం



బొబ్బిలి.. గొల్లపల్లిలో తడిసిన వరిపంటను చూపిస్తున్న కౌలు రైతు అనసూర్య

ప్రజాశక్తి-బొబ్బిలి
ఫెంగల్ తుపాను రైతులను నిండా ముంచేసింది. తుపానుతో జిల్లా వ్యాప్తంగా మూడురోజులుగా కురిసిన తేలికపాటి జల్లులు, వర్షాలతో పొలాల్లో ఉన్న వరిచేను తడిసి ముద్దయింది. దీంతో బొబ్బిలి, బాడంగి, రేగిడి, సంతకవిటి, రాజాం, రామభద్రపురం, తెర్లాం, శృంగవరపుకోట, గజపతినగరం, దత్తిరాజేరు, చీపురుపల్లి, గరివిడి, తదితర మండలాల్లో కోసిన వరిపంట తడిసి పోవడంతో రైతులు కన్నీరు పెడుతున్నారు. పంట పొలాల్లో ఉన్న వరికుప్పలు కూడా తడిసిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరితో పాటు మొక్కజొన్న, పత్తి పంటలకు నష్టం వాటిల్లింది. తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు వరిపంట నష్టపోయిన వారిలో కౌలు రైతులు ఎక్కువగా ఉన్నారు. బొబ్బిలి పట్టణంలోని గొల్లపల్లికి చెందిన బైరెడ్డి సత్తి ఎకరా, పొందూరు సత్యనారాయణ ఎకరా, రెడ్డి శ్రీను రెండు ఎకరాలు, పాలిపెంట నారాయణరావు మూడు ఎకరాలు, కంగట్ల మధు రెండు ఎకరాలు భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. వీరంతా అప్పులు చేసి సాగు చేస్తే వర్షాలకు తడిసిపోవడంతో వారంతా కన్నీరు పెడుతున్నారు.

పెరిగిన అలల తాకిడి

భోగాపురం : మండలంలో తీరప్రాంత గ్రామాల్లో ఫెంగల్ తుపాను కారణంగా సముద్రంలో అలల తాకిడి ఆదివారం పెరిగింది. ముక్కాం తీరంలో సముద్రం సుమారు 10 మీటర్లు ముందుకొచ్చింది. ఒడ్డున పెట్టిన వలలు, బోట్లు వరకు అలల తాకిడి ఉండడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. మరో పక్క పొలాల్లో కోసిన వరి చేను తడిసిపోతుండడంతోపాటు రైతులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




ముక్కాంలో ఒడ్డున ఉన్న బోట్ల వరకు వస్తున్న అలలు

పొలాల్లో చేరిన నీరు

వేపాడ : మండలంలో మూడురోజులుగా కురిసిన వర్షాలకు వరిపొలాల్లో నీరు చేరింది. నల్లబిల్లి రెవెన్యూ పరిధిలో గోకాడ పద్మావతికి చెందిన 1.40 ఎకరాలు, సెనగాని విజయలక్ష్మికి చెందిన 1.60 ఎకరాల్లో కోసిన వరిచేనంతా తడిసి ముద్దయింది. దీంతో ధాన్యం రంగు మారే అవకాశముందని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పంట చేతికొచ్చే సమయంలో తుపాను తమను ముంచేసిందని రైతులు వాపోతున్నారు.



భోగాపురం గ్రామంలో నేలకొరిగిన వరి చేను



దత్తిరాజేరు.. కోసిన వరిచేను పొలంలో చేరిన నీరు

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు భరోసానివ్వాలి

- కలెక్టర్ అంబేద్కర్
- ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా భారీ ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరంకోట
ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు భరోసానివ్వాలని, తద్వారా వారిలో ఆత్మస్థైర్యం నింపడానికి కృషి చేయాలని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ ఏడాది జిల్లాలో 425 కేసులు నమోదు అయ్యాయని గుర్తుచేశారు. ఎక్కువగా ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా వ్యాధి వ్యాప్తి చెందకుండా నిరోధించగలమన్నారు. వ్యాధిగ్రస్తులు ఊహాగానాలకు తావులేకుండా క్రమం తప్పకుండా మందులు వేసుకొని పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆయుర్దాయం పెరుగుతుందని చెప్పారు.



బాలలతో సహపంక్తి అల్పాహారం చేస్తున్న కలెక్టర్ అంబేద్కర్

బాలలతో సహపంక్తి అల్పాహారం

ఎయిడ్స్ బారిన పడిన విద్యార్థినీ విద్యార్థులతో కలిసి కలెక్టర్ బంగ్లాలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఏర్పాటుచేసిన సహపంక్తి అల్పాహారం కార్యక్రమంలో కలెక్టర్ అంబేద్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించారు. విద్యాభ్యాసం కొనసాగించాలని, అందుకు కావాల్సిన ఏర్పాట్లు జిల్లా యంత్రాంగం సమకూరుస్తుందని భరోసానిచ్చారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎయిడ్స్‌పై అవగాహన గీతాలు ప్రేక్షకులను ఆకర్షించాయి. అనంతరం ఎయిడ్స్‌పై తీసుకోవలసిన జాగ్రత్తలపై వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఎయిడ్స్ నియంత్రణ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి రాణి పాల్గొన్నారు

భారీ ర్యాలీ

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఎయిడ్స్ కంట్రోల్ ఆధ్వర్యంలో కాంప్లెక్స్ వద్ద నుంచి కలెక్టరేట్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.వి రాజేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డిసిహెచ్ఎస్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కోరారు. ర్యాలీలో రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ కెఆర్‌డి. ప్రసాద్, ఎంఆర్ఎన్ సిసి కెప్టెన్ ఎ.కళ్యాణ్ అశోక్ కుమార్, పలు కళాశాలల విద్యార్థులు, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ, సఖి ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కేజ్రీవాల్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
పాదయాత్ర నిర్వహిస్తున్న ఆమ్ఆద్మీ పార్టీ వ్యవస్థాపకులు అరవింద్ కేజ్రీవాల్‌పై ద్రావకంతో దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆ పార్టీ జిల్లా కన్వీనర్ పైల రమేష్ రాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రాంతీయ పార్టీగా అవతరించిన ఆమ్ఆద్మీ పార్టీ తక్కువ కాలంలోనే జాతీయ స్థాయికి ఎదగడాన్ని చూసి ఓర్వలేక ఆయనపై తరచూ దాడులు చేయిస్తున్నారని మండిపడ్డారు. దాడుల వెనుక ఉన్న అసలు సూత్రధారులను పట్టుకోవాలని డిమాండ్ చేశారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడమే లక్ష్యం

జన విజ్ఞాన వేదిక



మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధానకార్యదర్శి రమణ ప్రభాత్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
ప్రజల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంచడమే లక్ష్యంగా కృషి మరింత పెరగాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా వార్షిక మహాసభ పిలుపునిచ్చింది. ఆదివారం జెడ్‌పి ప్రాంగణంలోని మినిస్టీరియల్ భవనంలో జన విజ్ఞాన వేదిక వార్షిక మహాసభను జిల్లా ఉపాధ్యక్షులు పి.సత్యంనాయుడు అధ్యక్షతన నిర్వహించారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా అవగాహన పెంచడంతోపాటు యువతను సన్మార్గంలో నడిపే కార్యాచరణకు చొరవతో పనిచేయాల్సిన అవసరం చాలా ఉందని తీర్మానించింది. ఇందులో భాగంగా విద్య, ఆరోగ్యం, పర్యావరణం, యూత్ సబ్ కమిటీలను ఎన్నుకొని, వాటికి నిర్దిష్టమైన దిశానిర్దేశం చేసింది. ముందుగా జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రమణప్రభాత్ కార్యకలాపాల నివేదిక ప్రవేశపెట్టారు. చెకుముకి సైన్స్ సంబరాల నిర్వహణలో సహకరించిన మండల బాధ్యులను సమతా విభాగం జిల్లా కన్వీనర్ జి.నిర్మల, సాహితీస్రవంతి జిల్లా కార్యదర్శి చీకటి దివాకర్, జెవివి జిల్లా గౌరవ అధ్యక్షులు జె.నీలయ్య, తదితరులు జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.రాజగోపాల్, నగర అధ్యక్ష, కార్యదర్శులు కె.శశిధర్, డాక్టర్ ఎల్.చిన్నారి, తదితరులు పాల్గొన్నారు.

మూఢవిశ్వాసాలను ఎండగట్టిన గురజాడ



గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఇందిర, తదితరులు

ప్రజాశక్తి-విజయనగరంకోట
మహాకవి గురజాడ అప్పారావు రచనల ద్వారా సమాజంలోని మూఢవిశ్వాసాలను ఎండగట్టారని మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల తెలుగు అధ్యాపకులు కన్నంనాయుడు తెలిపారు. విజయనగరంలోని చాసో భవనంలో గురజాడ అప్పారావు 109వ వర్ధంతి సభను గురజాడ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయురాలు రాధా భవాని అధ్యక్షతన జరిగిన సభలో గురజాడ మనుమరాలు ఇందిర మాట్లాడుతూ గురజాడ మరణించడానికి ముందు కూడా ఆహార శాస్త్రంపై ఒక పుస్తకం రాయాలన్న అభిప్రాయాన్ని వ్యక్తంచేశారని గుర్తుచేశారు. గురజాడ విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులలో అభ్యుదయ భావజాలాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే లక్ష్యంతో గురజాడ విజ్ఞాన కేంద్రం పనిచేస్తోందన్నారు. ఉన్నత పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు నృత్య ప్రదర్శనలు, దేశభక్తి గేయ నృత్య రూపకం ఆహూతులను ఆకట్టుకున్నాయి.



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహన్ రావు

బోధన సమయాన్ని హరించొద్దు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
మెగా పేరెంట్స్ సమావేశం పేరుతో ఉపాధ్యాయుల బోధన సమయాన్ని హరించవద్దని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరావు అధ్యక్షతన జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు ఈ నెల 7న తలపెట్టిన మెగా పేరెంట్స్ మీటింగ్‌ను జయప్రదం చేయాలని అధికారులంతా ఎంఆర్‌సిలో ప్రతిరోజూ సమావేశాలు పెట్టి ఉపాధ్యాయులు బడిలో పాఠాలు చెప్పకుండా చేస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రుల సమావేశం కోసం వివిధ కమిటీలు వేయడం, ఆ కమిటీలను యాప్‌లో అప్‌లోడ్ చేయడం వంటి పనుల ప్రభావం ఈ నెల 9 నుంచి జరిగే ఎస్ఎ-1 పరీక్షలపై పడుతుందని చెప్పారు. బోధనకు ఆటంకంగా ఉన్న యాప్‌లను రద్దు చేయాలని, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుని కేటాయించి విద్యా ప్రమాణాలు మెరుగుదల కోసం ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ఉపాధ్యాయులను ఓటర్లు గా నమోదు చేయాలని, పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు మీసాల అప్పలనాయుడు, సహాధ్యక్షులు వి.ప్రసన్నకుమార్, కోశాధికారి సిహెచ్ భాస్కరరావు, జిల్లా కార్యదర్శులు కె.ప్రసాదరావు, సిహెచ్.తిరుపతి నాయుడు, జి.రాజారావు, ఎన్.సత్యనారాయణ, వి.వి.రాధా భవాని, కె.శ్రీదేవి ఎ.శంకరరావు, ఎం.రఘునాథ రాజు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ పి.రాంప్రసాద్ పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ.. బాదుడు గ్యారెంటీ

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఎద్దేవా



మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
చంద్రబాబు చెప్పిన ష్యూరిటీ ఏమో గానీ ప్రజలపై బాదుడు మాత్రం గ్యారెంటీ అయిందని జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఎద్దేవాచేశారు. ఆదివారం జెడ్‌పి సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వల్ల రాష్ట్ర ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఆర్థిక భారం మోయాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పారు. ఎన్నిలకు ముందు ఛార్జీలు పెంచనని ప్రజలకు వాగ్దానం చేసిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఆ హామీని తుంగలోకి తొక్కి ప్రజలకు నరకం చూపిస్తున్నారని విమర్శించారు. ఆరు నెలల్లో రెండు సార్లు ట్రూఅప్ ఛార్జీల పేరిట రూ.15,485.36 కోట్ల భారాన్ని ప్రజలపై మోపారని దుయ్యబట్టారు. ఎన్నికల ప్రచారంలో ఛార్జీలు తగ్గిస్తానని ఊరు వాడా ప్రచారం చేశారని గుర్తుచేశారు. విద్యుత్తు ఛార్జీలు పెంచబోమని, ట్రూఅప్ ఛార్జీలు కూడా ఎత్తేస్తామని నాడు బీరాలు పోయిన చంద్రబాబు.. తాను ఏ హామీ ఇవ్వలేదంటూ ఇప్పుడు నిస్సిగ్గుగా బుకాయిస్తున్నారని విరుచుకుపడ్డారు. ప్రజలను మోసం చేయడంలో బాబు బ్రాండ్ అంబాసిడర్ అని ధ్వజమెత్తారు. అధికారం చేపట్టగానే బాదుడే బాదుడు మొదలెట్టిన టిడిపి కూటమి సర్కారు ఒక విఫల ప్రభుత్వమని మండిపడ్డారు.

వైసిపి ప్రభుత్వ హయాంతో పోలిస్తే ఇప్పటికే స్కూల్, కాలేజీ ఫీజులు పెరిగాయని, పాల ధరలు పెరిగాయని... ఇంత దిగజారుడు పాలన తానెప్పుడూ చూడలేదని దుయ్యబట్టారు. నిజాలని చూపిస్తూ ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రజలకు చేరవేసే సోషల్ మీడియా సభ్యులపై అక్రమ కేసులు పెట్టి గొంతు నొక్కాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో వైసిపి నాయకులు కె.వి.సూర్యనారాయణ రాజు, జైహింద్ కుమార్ పాల్గొన్నారు.



ప్రమాదానికి గురైన కారును పరిశీలిస్తున్న అధికారులు

ఎలా జరిగింది?

పోలిపల్లి ప్రమాదంపై అధికారుల విచారణ

ప్రజాశక్తి-భోగాపురం
మండలంలోని పోలిపల్లి వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన ప్రమాదంపై అధికారులు విచారణ చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలను విశ్లేషించారు. ఈ ప్రమాదంలో శ్రీకాకుళం పట్టణానికి చెందిన నలుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మణిబాబు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, జాతీయ రహదారుల సంస్థ ఇంజినీర్ మల్లికార్జునరావు, భోగాపురం సిఐ ప్రభాకర్ సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదం ఏ విధంగా జరిగిందో కారణాలపై విశ్లేషించారు. కారు అతివేగంగా నడపడం వల్ల డివైడర్‌ను ఢీ కొట్టిన వెంటనే టైర్లు పేలిపోయినట్లు భావిస్తున్నారు. అక్కడ నుంచి అవతలి రోడ్డుకు బోల్తా కొట్టడంతో ఎదురుగా వస్తున్న లారీని కారు ఢీకొంది. అలాగే వర్షం కూడా ప్రమాదానికి మరో కారణంగా భావిస్తున్నారు. దీనిపై పూర్తి నివేదికను విశ్లేషించి ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు వారు తెలిపారు.

స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం


'ప్రజాశక్తి'తో విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య ముఖాముఖి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్
విజయనగరాన్ని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. అందుకు నగర ప్రజలు సహకరించాలని కోరారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. నగరాభివృద్ధికి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు తీసుకుంటున్న చర్యలను అందులో వెల్లడించారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి.?

విజయనగరాన్ని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. రోజు వారీ వచ్చే 119 మెట్రిక్ టన్నుల చెత్తలో 97 శాతం చెత్తను విద్యుత్తు తయారు చేసే జిందాల్ ఎనర్జీ సంస్థకు పంపిస్తున్నాం. నగరంలో ప్రధాన వాణిజ్య కూడళ్లలో ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ చేపడుతున్నాం. దీనికోసం రూ.50 లక్షలతో రాత్రివేళ పారిశుధ్య పనులు చేపడుతున్నాం. నగరంలో చిన్న కాలువలు కావడంతో కొత్తగా నిర్మాణాలు చేపట్టేందుకు నిధుల లభ్యత మేరకు చర్యలు తీసుకుంటాం.

నగరంలో కుక్కల నియంత్రణకు, దోమల నివారణకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి.?



నగరంలో వీధి కుక్కల నియంత్రణకు శస్త్రచికిత్సలు చేయిస్తున్నాం. ఇప్పటికి 4423 కుక్కలకు శస్త్రచికిత్సలు చేయించాం. పందుల నివారణకు వాటి పెంపకందారులతో సమావేశం పెట్టి శివారు ప్రాంతాలకు తరలించాలని చెప్పాం. అతిక్రమిస్తే అపరాధ రుసుం విధిస్తాం. దోమల నివారణకు షెడ్యూల్ ప్రకారం స్ప్రేయర్లతో కాలువల్లో, చెరువుల్లో యాంటి లార్వా పిచికారీ చేయిస్తున్నాం. ప్రతి రోజూ ఫాగింగ్ చేయిస్తున్నాం.

ప్లాస్టిక్ నిషేధానికి చేపడుతున్న చర్యలు.?

ప్లాస్టిక్ నిషేధానికి ఇప్పటికే నగరంలోని వ్యాపారులతో సమావేశం పెట్టాం. సింగిల్ యూజ్ (120 మైక్రోన్ల కంటే తక్కువ మందం కలిగిన) ప్లాస్టిక్ కవర్లను విక్రయించరాదని ఆదేశించాం. ప్రజారోగ్య సిబ్బంది ద్వారా టన్నుకుపైగా ప్లాస్టిక్‌ను సీజ్ చేశాం. దీని కోసం ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశాం. ప్లాస్టిక్‌కి ప్రత్యామ్నాయ మార్గాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటున్నాం.

ట్రేడ్ లైసెన్స్ వసూళ్లు ఎలా ఉన్నాయి.?

కమిషనర్‌గా నేను బాధ్యతలు తీసుకున్నప్పటికి 1460 ట్రేడ్ లైసెన్సులు ఉన్నాయి, వీటి ద్వారా రూ.19.99 లక్షలు వసూలయ్యేది. ఈ మూడు నెలల కాలంలో 1378 ట్రేడ్ లైసెన్సులు కొత్తవి గుర్తించి, పన్ను వేయడం ద్వారా రూ.22 లక్షలు ఆదాయం లభించింది. షాపులున్న ప్రతి వ్యాపారీ ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి.

అనధికార నిర్మాణాలపై చేపడుతున్న చర్యలు.?

నగరంలో అనధికార నిర్మాణాలపై, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై టౌన్ ప్లానింగ్ సిబ్బందితో ప్రతి రోజూ పర్యవేక్షణ చేయిస్తున్నాం. గుర్తించిన అనధికార నిర్మాణాలపై మున్సిపల్ చట్టం ప్రకారం కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేసి, కోర్టు తీర్పు ప్రకారం చర్యలు తీసుకుంటున్నాం. నగర పాలక సంస్థ ఆస్తులు.. సంస్థ ఆధీనంలో ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

ఆస్తి, ఇతర పన్నుల వసూలు ఎలా ఉంది? అదనపు నిర్మాణాలు, వినియోగ మార్పిడి జరిగినప్పుడు.. ఆస్తి పన్ను మార్పిడి లేదంటున్నారు. దీనిపై వివరణ ఇస్తారా.?

ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను, నీటి ఛార్జీలు పన్ను వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. పన్నుల వసూళ్లకు బృందాలు ఏర్పాటు చేసి, లక్ష్యాలను నిర్దేశిస్తున్నాం. ఆస్తి పన్ను వినియోగ మార్పులు.. అంటే నివాసం నుంచి వాణిజ్య పరంగా వినియోగిస్తే ఆస్తి పన్ను పెంచుతున్నాం. ఇప్పటి వరకు ఈ విధంగా మార్పు చెందిన 1112 అసెస్మెంట్లు గుర్తించి రూ.1.17 కోట్ల లక్ష్యాన్ని పెంచాం. ఆస్తి పన్ను లక్ష్యం రూ.63.42 కోట్లు కాగా రూ.23.88 కోట్లు వసూలు చేశాం. వీటితో పాటు కొత్తగా 1266 అసెస్మెంట్లు గుర్తించి మరో రూ.2.17 కోట్లు పన్నులు పెంచాం.



నగరంలో అభివృద్ధి పనుల పరిస్థితి ఏమిటి.?

ఎన్నికల కోడ్ మొన్నటి వరకు ఉండటంతో నగరంలో అభివృద్ధి పనులు జరగలేదు. ఈ ఆర్థిక సంవత్సరంలో వివిధ రకాల నిధులు రూ.5.74 కోట్లతో 71 పనులకు టెండర్లు పిలిచాం. వీటితో పాటు గుంతలు పూడ్చేందుకు ఇప్పటికే నగరంలో 1655 గుంతలు గుర్తించాం. టెండర్ దశలో ఉన్నాయి నిర్దేశించిన సమయానికిపనులు పూర్తవుతాయి.

రూ.200 కుళాయిలు ఎంత వరకు మంజూరు చేశారు.?

నగరంలో స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నాం. ఎప్పటికప్పుడు ఎమినిటిస్ కార్యదర్శుల ద్వారా నీటి పరీక్షలు చేయించి శుభ్రమైన నీరు అందించేందుకు కృషి చేస్తున్నాం. ఇటీవల రూ.200 కుళాయి మంజూరులో బదిలీల కారణంగా ఆలస్యమైంది. ప్రస్తుతం మంజూరు చేస్తున్నాం.

సచివాలయాల పని తీరు ఎలా ఉంది.?

సిటిజన్ చార్టులో పేర్కొన్న విధంగా నిర్ధారించిన సమయం ప్రకారం సేవలు ప్రజలకు అందించేందుకు కృషి చేస్తున్నారు. సచివాలయాల ద్వారా 65,427 సేవలు అందించారు. ఉద్యోగులు తమ విధులు సక్రమంగా నిర్వర్తించేలా చర్యలు తీసుకున్నాం.

వీధి దీపాల నిర్వహణ ఎలా ఉంది.?

ప్రస్తుతం నగరంలో 20,052 వీధి దీపాలు ఉంటే వాటిలో 1200 వరకు వెలగడం లేదు. మరో 50 వరకు మరమ్మతులకు గురయ్యాయి. ప్రజాప్రతినిధులు, ప్రజలు ఫిర్యాదు చేసిన వెంటనే వీధి దీపాలు వెలిగించేలా చర్యలు తీసుకుంటున్నాం.

తడిచిన పంట రక్షణకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వర్షాలు కారణంగా తడిచిపోయిన వరిపంట రక్షణకు చర్యలు తీసుకువాలని ఎఒ ఎం.పూర్ణిమ సూచించారు. ఆదివారం నెల్లిమర్ల గ్రామంలో ఆమె వర్షానికి తడిచిన వరి పొలాలు, వరి కుప్పలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తడిచిన వరి పంట రక్షణకు రైతులు చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా పొలంలో నీలిచిన నీరు బయటకు పోవడానికి బాటలు వేసుకోవాలన్నారు. వర్షం తగ్గగానే 5శాతం ఉప్పు ద్రావణం 5 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి తడిచిన కుప్పలు, పనలు మీద పిచికారీ చేసుకుంటే మొలక రాకుండా ఉంటుందన్నారు. ఎండ రాగానే పనలు తిప్పి అరబెట్టు కోవాలని తెలిపారు. దీనివల్ల గింజ రంగు మారకుండా ఉంటుందని, పాలుపోసుకునే దశలో వరి చేనుకు కార్బెండజిమ్ 2 గ్రాములు లేదా ప్రొపికోనాజోలు 1ఎంఎల్ లీటర్ నీటికి పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ టి.హేమామహేష్, విఎఎ కె.శ్యామ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని తుమ్మికాపల్లి వినాయక నగర్‌లో ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ హరికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం 43 మంది ఒంటరి వృద్ధులకు 12 రకాల నిత్యవసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి అమ్మ సందీప్ కేటరింగ్, రైల్వే రిటైర్డ్ ఉద్యోగి రమణ, ట్రస్టు సభ్యులు సహకారం అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ జాయింట్ సెక్రెటరీ డాక్టర్ రవి, నగేష్, రాజు, రామారావు, తులసి బాయ్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పుట్టిన రోజున పది మొక్కలు నాటుదాం కార్యక్రమాన్ని సిమ్ ఆవరణలో ఆదివారం నిర్వహించారు. జియో వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ పుట్టినరోజు సందర్భంగా అరేకాపామ్, సువర్ణ గన్నేరు, నందివర్ధనం, పారిజాతం మొదలగు నూట ఎనిమిది మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. రాయితీ పై ఐదువందల యాబై టేకు దుంపలను అందజేశారు. పుట్టినరోజున పది మొక్కలు నాటడాన్ని సాంప్రదాయంగా అందరం పాటిద్దామని, సామాజిక అడవుల పెంపకంలో అందరూ భాగస్వాములు కావాలని జియో ఆయన కోరారు. కార్యక్రమంలో సిమ్ డైరెక్టర్ వై.విజయలక్ష్మి, మాజీ పంచాయతీ వార్డు సభ్యుడు బొబ్బిలి అప్పారావు, హృషీకేశ్, లాస్య శ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ట్రై సైకిల్ అందజేత

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని పోతనాపల్లి గ్రామంలో గురుదేవా చారిట్రబుల్ ట్రస్ట్ సహకారంతో వికలాంగుడికి మూడు చక్రాల బ్యాటరీ సైకిల్ బండిని ఆదివారం ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అందించారు. అనంతరం గురుదేవా చారిట్రబుల్ ట్రస్ట్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట మండల అధ్యక్షులు జీ.ఎస్.నాయుడు, టిడిపి నాయకులు కూనిరెడ్డి రాము, గోగాడ అప్పలసత్యం, బూత్ ఇంచార్జ్ నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ కాపుగంటి వాసు, ఐటిడిపి నాయకులు చక్కా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరు కావాలి

ప్రజాశక్తి - వేపాడ



స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకకు మండల స్థాయి అధికారులంతా విధిగా హాజరు కావాలని ఎంపిడిఒ సిహెచ్ సూర్యానారాయణ తెలిపారు. ఆయన ఆదివారం ప్రజాశక్తితో మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరుకాని అధికారులు వివరాలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. ఈ విషయాన్ని మండల స్థాయి అధికారులు అందరూ గుర్తు ఉంచుకొని ఉదయం 10 గంటలకే హాజరు కావాలని తెలిపారు.

వ్యాసరచన పోటీల్లో తృతీయ స్థానం

ప్రజాశక్తి - వేపాడ

గురజాడ వర్ధంతి సందర్భంగా విజయనగరంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో సోంపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. గణిత ఉపాధ్యాయులు ఆతవ రవిశంకర్ శిక్షణలో కె.స్వరూప, ఎం. హాసిని వ్యాసరచన పోటీల్లో పాల్గొని తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. వీరికి సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వి రమణ బహుమతులు, ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలువురు అభినందించారు.

'మీసాల'కు గురజాడ సాహితీ పురస్కారం

ప్రజాశక్తి- బొబ్బిలి

విజయనగరం గురజాడ సాంస్కృతిక సమాఖ్య సాహితీ ప్రస్థానంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన గురజాడ ఉత్తమ కవితా సాహితీ పురస్కారం అప్పలరాజుపేట వాసి, బొబ్బిలి నాయుడు కోలనీ నివాసీ ప్రముఖ కవి, రచయిత, నటులు, డప్పు వాయిద్య కారులు, గణితోపాధ్యాయులు మీసాల చినగౌరినాయుడు అందుకున్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన కవితల పోటీలలో సామాజిక స్పృహతో ఆడవారిపై జరుగుతున్న ఆకృత్యాలను నిరసిస్తూ చినగౌరినాయుడు రచించిన చిగురించని పువ్వు అనే కవితకు ఈ గురజాడ పురస్కారం దక్కినట్లు సంస్థ నిర్వాహకులు కాపుగంటి ప్రకాశరావు, సుబ్బారావు, జక్కు రామకృష్ణ, మానాప్రగడ సాహితీ తెలిపారు. ఈయనకు సుప్రీమ్‌కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వి రమణ చేతులు మీదుగా పురస్కారం అందుకున్నట్లు తెలిపారు.

సిసి కెమెరాలపై అవగాహన

ప్రజాశక్తి - సంతకవిటి



మాట్లాడుతున్న ఎస్ఐ గోపాలరావు

మండలంలోని మందరాడ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుపై ఎస్ఐ గోపాల్‌రావు ఆదివారం అవగాహన కల్పించారు. గ్రామంలో రోడ్డుకు ఇరు వైపులా ఉన్న షాప్ యాజమానులతో సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరా ఏర్పాటుతో దొంగతనాలను అరికట్ట వచ్చుని తెలి పారు. షాపుల ఆవరణలో వ్యర్థ పదార్థాలు ఉంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దుకాణాల యజమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ జట్టుకు యూనిఫాం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల ఐదో తేదీ నుంచి నగరంలో బూర్లి రామారావు మెమోరియల్ జిల్లా స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ జరగనుంది. విజయనగరం జిల్లా జట్టు క్రీడాకారులకు కంటి వైద్యులు కుమారస్వామి రూ.15 వేలు విలువ చేసే క్రీడా దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని బొడ్డవలస సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని ఆదివారం పట్టుకొని వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు తెలిపారు. బొడ్డవలస వద్ద పేకాటాడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేసి అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.18 వేలు, రెండు మోటార్ సైకిళ్లు, 5 సెల్ ఫోన్లు సీజ్ చేశామని చెప్పారు. వీరి పై కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తామన్నారు.

వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి


ప్రజాశక్తి - గజపతినగరం

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ కె.లక్ష్మణరావు అందించిన వివరాలు ప్రకారం.. దత్తిరాజేరు మండలం మానాపురం గ్రామానికి చెందిన రాజేటి కృష్ణవేణి (78) వైజాగ్‌లో ఉన్న ఆమె సోదరి వద్దకు వెళ్లేందుకు బయలుదేరింది. గుడివాడ సమీపంలో రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజపతినగరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

నాగావళిలో నీటి చౌర్యం

● అనుమతులకు మించి దోపిడీ చేస్తున్న సంకిలి ప్యారీ షుగర్స్ ● పట్టించుకోని అధికారులు ● దొంగతనంపై ఫిర్యాదు

ప్రజాశక్తి- రేగిడి



అధికారులకు ఫిర్యాదు చేసిన పత్రం ఇదే..

మండలంలోని సంకిలి ఇఐడి ప్యారి షుగర్స్ యాజమాన్యం షుగర్ ఫ్యాక్టరీతో పాటు వాటి అనుబంధ సంస్థ అయిన ఇథనాలు ప్లాంట్‌కు స్థానిక నాగావళి నది నుంచి పైపులైన్లు ద్వారా అనుమతులకు మించి యదేచ్ఛగా నీటి చౌర్యం చేస్తున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొన్ని వేల లీటర్ల నీరు సుగర్స్ యాజమాన్యం దోపిడీ చేయడం పట్ల ప్రభుత్వ నీటి టాక్స్ ఎగనామం పెట్టింది. వాస్తవంగా నాగావళి నీటి తరలింపునకు యాజమాన్యం 2002లో పది సంవత్సరాలకు గాను అనుమతి తీసుకుంది. దీనికి జిఒ నెంబరు 152ను జారీచ చేశారు. మళ్లీ పదేళ్ల తరువాత 2015 వరకూ జిఒ నెంబరు 35 ద్వారా పొడిగించి అనుమతి తీసుకున్నారు. 2015 తరువాత ఎటువంటి అనుమతులూ తీసుకోకుండా నిబంధనలను ఉల్లంఘిస్తూ సుమారు పది సంవత్సరాలుగా నీటిని చౌర్యం చేస్తూ వ్యాపారం చేసుకుంటున్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నాగావళి నది నుంచి ఫ్లో మీటర్ రక్షణ లేకుండా అప్పటి సుగర్ కర్మాగారానికి అనుమతులు ఉండగా, ఇటీవల నిర్మించిన ఇథనాలు (డిస్టలరీ) ప్లాంట్‌కు నీటి తరలింపు అనుమతులు లేకపోయినా నిర్దేశిత సమయంలో రోజుకు 10 గంటలకు మించి నాగావళి నది నీటిని యథేచ్ఛగా చౌర్యం చేస్తున్నారు. నాగావళి జలాల దోపిడీతో దిగువ గ్రామాలకు తాగు, సాగునీరు అందడం లేదని ఆయా గ్రామాలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడుగా భూగర్భ జలాలు కూడా ఒట్టి పోవడంతో ఆయా గ్రామాల ప్రజలు నీటి బావులు, బోర్‌వెల్స్ నీరురాక తాగునీటికి ఇబ్బం దులు పడుతున్నారు.



కర్మాగారానికి తరలిపోతున్న నీరు

వాస్తవానికి ప్రతిరోజూ రెవెన్యూ, జల వనరుల శాఖ అధికారులు పర్యవేక్షణ చేపట్టవలసి ఉన్నా ఆ దిశగా అధికారులు పట్టించుకోకపోవడంతో లక్షల లీటర్లు నాగావళి నీరు కర్మాగార యాజమాన్యం చోరీ చేస్తుంది. అధికారులు పర్యవేక్షణ జరిపి నీటి చౌర్యాన్ని పరిశీలించి నీటి రీడింగ్ మీటర్‌ను తనిఖీ చేసి గత పది సంవత్సరాల నుంచి ఎన్ని వేల లీటర్లు దోపిడీ చేసినట్లు లెక్కవేసి ప్రభుత్వానికి నగదు కట్టేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

నాగావళి నది నుంచి నీటి సౌర్యం పై ఫిర్యాదు

సంకిలి నాగావళి నది నుంచి ప్యారి సుగర్స్ యాజమాన్యం నీటి తరలింపునకు ఎటువంటి అనుమతులూ తీసుకోకుండా ఇష్టానుసారంగా నీటిని దొంగిలిస్తున్నారని సంకిలి సర్పంచ్, మెజార్టీ పాలకవర్గ సభ్యులు, అప్పాపురం మాజీ సర్పంచ్ కరణం శ్రీనివాసరావు, ఇరిగేషన్ చీఫ్ విజయవాడ, ఇతర అధికార్లకు ఇటీవల ఫిర్యాదు చేశారు. గత పది సంవత్సరాలుగా అనుమతులకు మించి నీటి చౌర్యంతో పాటు మోటారుకు తప్పుడు ఫ్లో మీటర్‌తో రన్నింగ్ చేసి నీటిని దోపిడీ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. రోజువారి 10 గంటల కంటే ఎక్కువ సమయం నీటిని తోడుతున్నారని, ట్యాక్స్ కట్టకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆ ఫిర్యాదులు వివరించారు. గతంలో డిఇ రవికుమార్, ఎఇ రాజేష్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ తూతూ మంత్రంగానే పరిశీలించి, బదిలీపై వెళ్లిపోయారని అన్నారు. సంకిలి నాగావళి నీటి చౌర్యంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టకుండా చూడాలని అధికారులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

హామీలను అమలు చేయండి

మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

ప్రజాశక్తి - గజపతినగరం

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించి, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచమని హామీ ఇస్తూ వైసిపి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచిందంటూ బాదుడే బాదుడు కార్యక్రమంలో గగ్గోలు పెట్టిన చంద్రబాబు విద్యుత్ చార్జీలు పెంచి 15 వేల కోట్ల రూపాయలు, ఆరు నెలల కాలంలో 63 వేల కోట్ల అప్పుల భారాన్ని ప్రజలపై వేశారన్నారు. ధాన్యం అక్రమంగా పక్క జిల్లాలకు తరలిపోతుంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోతున్నాయంటూ దానికి కారణం ఎవరు అంటూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రశ్నించిన దానికి సిఎం చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు. సూపర్ సిక్స్‌లో భాగంగా రైతుబంధు ద్వారా 20వేల రూపాయలు ఇస్తానన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. పెన్షన్లు తగ్గించి కొత్త పెన్షన్లు ఇవ్వకుండా మిగిలిన పెన్షన్లే కొనసాగిస్తూ అదేదో ఘనకార్యంగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. అన్ని రంగాల్లో విఫలమైన మీ అసమర్థ పాలనను గత ప్రభుత్వానికి ఆపాదించవద్దని హితవు పలికారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి గార తవుడు, పార్టీ సీనియర్ నాయకులు బెల్లాన త్రినాధరావు, కరణం ఆదినారాయణ, వేమలి ముత్యాల నాయుడు, వైస్ సర్పంచ్ కర్రీ రామునాయుడు, లోగిస శ్రీను తదితరులు పాల్గొన్నారు.

లక్షలు వ్యయం..లక్ష్యానికి దూరం

● నిరుపయోగంగా శీతల గిడ్డంగి
● కుంటుపడుతున్న ఎఫ్‌పిఒ సంఘాలు
● పట్టించుకోని అధికారులు

గ్రామాల్లో సన్నా చిన్న కారు రైతులను గుర్తించి వారు పండించిన పంటలను, సరుకులను నిల్వ చేసుకునే అవకాశం కల్పించడం, రుణాలు అందించడంతో పాటు వసూళ్లు చేయడం, రైతులకు వ్యవసాయానికి అవసరమైన పరికరాలను తక్కువ ధరకు అందించడం వంటివి నిర్వహించివలసిన రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పిఒ) సక్రమంగా నడవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో రైతులు పడ్డించిన పంటలను దాచుకోవడానికి, రుణాలను తీసుకోవడానికి, తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించడానికి ఇబ్బందులు పడుతున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చేసిన సోలార్ శీతల గిడ్డంగి (కోల్డ్ స్టోరేజీ), రైతు ఉత్పత్తిదారుల సంస్థ భవనం నిరుపయోగంగా ఉన్నాయి.

ప్రజాశక్తి- వంగర



నిరుపయోగంగా ఉన్న రైతు ఉత్పత్తిదారుల సంస్థ భవనం

రైతులకు మేలు చేకూర్చాలని ఉద్దేశంతో 2017లో ఏర్పాటైన రైతు ఉత్పత్తిదారుల సంస్థ(ఎఫ్‌పిఒ)కు సంబంధించి మండలంలో వివిధ గ్రామాలలో మొత్తం 195 సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాలలో ఉన్న సభ్యులందరికీ పొదుపు కట్టించడంతో పాటు వారికి రుణాలు అందించడం, వ్యవసాయానికి సంబంధించి వివిధ పరికరాలు తక్కువ ధరకు అందించడం ఈ సంస్థ ముఖ్య ఉద్దేశం. అయితే మండలంలో ఈ సంస్థ ప్రారంభంలో నిర్వహణ సక్రమంగా ఉండడంతో రైతులకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉండేది. గత రెండేళ్లుగా ఈ సంస్థ కార్యకలాపాలు పెద్దగా కనిపించకపోవడంతో ఈ సంఘాలలో చేరటానికి రైతులు కూడా పెద్దగా మొగ్గు చూపటం లేదు.



నిరుపయోగంగా ఉన్న సీతల గిడ్డంగి

రుణాలు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం

మండలంలో ఈ సంస్థకు సంబంధించి 195 గ్రూపులు ఉన్నప్పటికీ ఇందులో 161 గ్రూపులకు మాత్రమే రుణాలు అందించారు. మిగతా 34 గ్రూపులకి ఎటువంటి రుణాలు అందించలేదంటే అధికారులు నిర్లక్ష్యం ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చును. ఈ సంస్థకు సంబంధించి 60 లక్షల రూపాయలు రొటేషన్ చేయవలసి ఉన్నప్పటికీ 18 గ్రూపులకు సంబంధించి ఆరు లక్షల రూపాయలు మొండు బకాయిలు ఉన్నాయంటే అధికారులు నిర్లక్ష్యం ఏంటో అర్థమవుతోంది. దీనికి సంబంధించిన అధికారులు రైతులకు అవగాహన కల్పించి ఉంటే ఇలాంటి బకాయిలేవి ఉండవని పలువురు చెబుతున్నారు.

నిరుపయోగంగా సోలార్ శీతల గిడ్డంగి

రైతు ఉత్పత్తిదారుల సంస్థ గ్రూపులలో రైతుల పంటల (ఆర్టికల్చర్)కు సంబంధించి పండ్లు, కూరగాయలు వంటివి సుమారు పది మెట్రిక్ టన్నులు నిల్వ చేసుకునేందుకు వీలుగా 15 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన సోలార్ శీతల గడ్డంగి పరికరాలు ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి. దీనిపై రైతులకు అధికారులు అవగాహన కల్పించకపోవడంతో ప్రస్తుతం అది నిరుపయోగంగా ఉంది. మరో 15 లక్షల రూపాయలతో రైతు ఉత్పత్తిదారుల సంస్థ భవనం నిర్మించినా అది కూడా ఖాళీగానే దర్శనమిస్తోంది. ఈ భవనానికి సంబంధించి తలుపులు కూడా ఎప్పుడూ తీయటం లేదని పలువురు విమర్శిస్తున్నారు. లక్షలాది రూపాయలు పెట్టి నిర్మించి నిరుపయోగంగా ఉంచడమేంటని అధికారులు తీరుపై పలువురు మండిపడుతున్నారు. ఇప్పటికైనా గ్రామాల్లో రైతులకి అవగాహన కల్పించి సీతల గిడ్డంగిని వినియోగంలోకి తెచ్చి సంస్థను అభివద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

సబ్సిడీపై ఎరువులు, పురుగు మందులు అందించాలి

రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా 2018 -19లో సబ్సిడీపై విత్తనాలు, పురుగు మందులు, రుణాలు సక్రమంగా అందేవి. రైతులకు కూడా ఎంతో మేలు జరిగేది. గత కొన్నేళ్లుగా సబ్సిడీపై ఎరువులు గాని పురుగు మం దులు గాని విత్తనాలు, రుణాలు గాని అందటం లేదు. దీంతో సంఘాలు నిర్వీర్యం అవుతున్నాయి. అధికారులు జోక్యం చేసుకుని గత మాదిరిగానే ఈ సంస్థ ద్వారా రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

మరడాన సత్యన్నారాయణ, ఎఫ్‌పిఒ మాజీ అధ్యక్షుడు, వంగర

సంఘాలు బలోపేతానికి చర్యలు



రెగ్యులర్‌గా ఉన్న గ్రూపులకు రుణాలు అందించడంతోపాటు రికవరీ కూడా చేస్తున్నాం. మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించి రైతు ఉత్పత్తిదారుల సంస్థ బలోపేతానికి చర్యలు చేపడుతున్నాం.

టి. మంగమ్మ, ఎఫ్‌పిఒ ఇంఛార్జి ఎపిఎం, వంగర మండలం

సర్పంచులంటే విలువ లేదా?

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సర్వసభ్య సమావేశంలో ధ్వజమెత్తిన సభ్యులు



అధికారులను నిలదీస్తున్న సర్పంచులు

సర్పంచులు, ఎంపిటిసిలంటే అధికారులకు విలువ లేదా అని మండల సర్వసభ్య సమావేశంలో అధికారులపై పలు గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపిటిసిలు ధ్వజమెత్తారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ కర్రోతు బంగార్రాజు, ఎంపిపి అంబళ్ల సుధారాణి అధ్యక్షతన ఎంపిడిఒ కె. రామకృష్ణరాజు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చ నిర్వహించగా సర్పంచులు, ఎంపిటిసిలు ధ్వజ మెత్తారు. ముఖ్యంగా గ్రామాల్లో మంజూరైన ఉపాధి హామీ పథకం పనుల కేటాయింపు, ధాన్యం సేకరణపై సర్పంచులు, ఎంపిటిసిలు అధికారులను ప్రశ్నించారు. సతివాడ, బొప్పడాం, టెక్కలి, పారసాం, తమ్మాపురం, సర్పంచులు రేవల్ల శ్రీను, అంబళ్ల కిరణ్, నేతేటి స్వామినాయిడు, గొలజాన నారాయణ రావు, పప్పల భాస్కర రావు, గుషిణి, బొప్పడాం ఎంపిటిసిలు చన మల్ల స్వాతి, బొంతు పురుషోత్తం నాయుడు మాట్లాడుతూ ఇటీవల మంజూరైన ఉపాధి హామీ పథకంలో అభివృద్ధి పనులు సర్పంచులు, ఎంపిటిసిలు ప్రమేయం లేకుండా వేరే వారి చేత ఎలా జరిపిస్తారని ప్రశ్నించారు. పనులు గుర్తించినపుడు సర్పంచులు, ఎంపిటిసిలు కావాలి గాని పనులు జరిపించి నపుడు తమకు తెలియకుండా ఎలా చేస్తారని మండిపడ్డారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ గ్రామంలో సర్పంచులు కీలకమని చెప్పినా అధికార్లు ఎమ్మెల్యే చెప్పిన వారికి పనులు ఇవ్వడం భావ్యం కాదని, అలాంటప్పుడు తమను సర్వసభ్య సమావేశానికి పిలవడం ఎందుకని పనులు ఎవరికి అప్పగించారో వారినే పిలిచి మీకు ఇష్టం వచ్చినట్లు చేసుకోండని ధ్వజమెత్తారు. సర్పంచులు, ఎంపిటిసిల ప్రమేయం లేకుండా అభివృద్ధి పనులు జరగనీయమని, అధికార్లు ఆ విధంగా తీర్మానం చేసి పంపిం చాలని హెచ్చరించారు. కాగా ధాన్యం కనుగోలులో స్పష్టత లేదని ఎవరు ఎపుడు వస్తారో తెలియని పరిస్థితుల్లో ధాన్యం ఎవరికి ఇవ్వాలో, డబ్బులు ఎలా వస్తాయో తెలియకుండా పోతుందని కాపలా కాయాల్సిన పరిస్థితి ఉందని తమ పరిస్థితి ఇలా ఉంటే రైతుల పరిస్థితి ఇంకెలా ఉంటుందో అర్థం చేసుకో వాలని చెప్పారు. స్పష్టత లేకపోవడం వల్లే ధాన్యం ప్రయివేటు వ్యక్తులకు వెళ్లిపోతున్నాయని తెలిపారు. రెవెన్యూ సమస్యలు కూడా పరిష్కరించడం లేదని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు.

సమన్వయంతో పని చేయాలి : మార్క్ ఫెడ్ చైర్మన్

సర్వ సభ్య సమావేశంలో సభ్యులు ధ్వజమెత్తడం పై మార్క్ ఫెడ్ రాష్ట్ర చైర్మన్ కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికార్లు సమన్వయంతో కలసి వెళ్లి అభివృద్ధి పనులు జరిపించాలని కోరారు. అధికార్లు, గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకుల మధ్య నలిగిపోకుండా బయటకు కక్కలేక మింగలేక ఉన్నారని పరిస్థితులు చేయి దాటకుండ చూసుకోవాలని సూచించారు. అనంతరం సభ్యులు మార్క్ ఫెడ్ చైర్మన్‌ను సత్కరించారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే కేసులు తప్పవు

ప్రజాశక్తి - రామభద్రపురం

గ్రామాల్లో మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్ఐ ప్రసాదరావు హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరే కంగా బెల్టు షాపులు ఎవరు నిర్వహించినా, బహిరంగంగా మద్యం సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే దీనిపై గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. గ్రామాభివృద్ధి పేరిట అక్రమంగా ఈ షాపుల నిర్వహణకు వేలం పాటలు పెట్టడం చట్ట విరుద్ధమని అలా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ముఖ్యంగా మద్యంతాగి వాహనాలు నడిపితే కేసులు తప్పవని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, మైనర్లు వాహనం నడిపి ప్రమాదం జరిపితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సీబుక్, ఇన్సురెన్స్, డ్రైవింగ్ లైసెన్సు పొంది ఉండాలని సూచించారు. గంజాయి రవాణా చేసినా, వినియోగించినా చర్యలు చేపడతామని, ఇందు లో భాగంగా కొట్టక్కి వద్ద చెకో పోస్టు ఏర్పాటు చేశామని అన్నారు. గంజాయి అక్రమ రవాణాపై ఎవరైనా సమాచారం ఇస్తే వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.మహిళలపై లైంగిక దాడులు చేసినా, వారిపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. ఇందులో భాగంగా సంకల్పం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో అవగాహనా సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

గిరిజనుల సంక్షేమం పట్టదా?

ప్రజాశక్తి- బొబ్బిలి

దేశంలో దళితులు, గిరిజనులు సంక్షేమం పాలకులకు పట్టడం లేదని అంబేద్కర్ పోరాట సమితి అధ్యక్షులు ఎస్.సాంబయ్య, ప్రధాన కార్యదర్శి ఎండ గోపాలరావు అన్నారు. దళితులు, గిరిజనులపై దాడులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా చేపట్టనున్న నిరసన కార్యక్రమాలు ప్రచార పత్రాలను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో 30కోట్లు వరకు ఎస్‌సి, ఎస్‌టిలు ఉంటే సంక్షేమం పూర్తిగా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎస్‌సి వర్గీకరణ పేరుతో దళితులను విడదీయడం అన్యాయమన్నారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 6 నుంచి ఫిబ్రవరి 10 వరకు నిరసన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఈనెల 6న జిల్లా వ్యాప్తంగా ప్రచారం చేస్తామన్నారు. కార్యక్రమంలో దళిత, గిరిజన నాయకులు ఆనంద్, కె.సత్యనారాయణ, గణపతి, డి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే ఎయిడ్స్ నివారణ

ప్రజాశక్తి - కొత్తవలస

ప్రజల భాగస్వామ్యంతోనే ఎయిడ్స్ నివారణ సాధ్యమని వియ్యంపేట పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ గోపాలకృష్ణ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం వైద్య సిబ్బంది డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల బాలికలతో కలిసి వియ్యంపేటలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. 2024 థీమ్ 'టేక్ ది రైట్స్ పాత్' నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇఒ నరసింహారావు, హెచ్‌వి పద్మావతి, హెచ్‌ఎస్. ఈశ్వరరావు, ఆప్తాలమిక్ ఆఫీసర్ ఈశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్స్ సత్యారావు, స్టాఫ్ నర్స్ రోజా, దీప, ఎమ్ఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎమ్స్, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

కొత్తవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ డి. సీతల్‌వర్మ ఆధ్వర్యంలో సిబ్బంది, ఆశ వర్కరలు ఎయిడ్స్ పట్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హోమియోపతి వైద్యులు తిరుపతిరావు, సిహెచ్ఒ అప్పలకొండ, పిహెచ్ఎన్ రమణమ్మ, హెచ్ఎస్ సూరిదేముడు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.



కొత్తవలస: ర్యాలీ చేస్తున్న సిబ్బంది, విద్యార్థులు

వేపాడ: మండల కేంద్రంలోని పిహెచ్‌సి వద్ద డాక్టర్ ఏ.ధరణి ఆధ్వర్యంలో ఆదివారం ఎయిడ్స్ నివారణ పై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ ఆంజనేయులు, సూపర్‌వైజర్ డి.సత్యనారాయణ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించామని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి ఈరన్న తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు మాట్లాడుతూ ఎయిడ్స్ అనేది అంటువ్యాధి కాదని ఆ వ్యాధి సోకిన వారిని అంటరా నితనంగా చూడకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ వి సుధీర్ అధ్యాపకులు వైఆర్‌సి, ఆర్ఆర్‌సి, కోఆర్డినేటర్ చల్లా శ్రీనివాస రావు, లక్ష్మణ్, శివకుమార్, రామకృష్ణ విద్యార్థులు పాల్గొన్నారు.

భోగాపురం: చైతన్యంతోనే ఎయిడ్స్ మహమ్మారని పారద్రో లాలని వైద్యాధికారి కె. శాలిని అన్నారు. ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం సుందరపేట 30 పడకల సామాజిక ఆసుపత్రి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆసుపత్రి నుంచి సుందరపేట గ్రామం వరకు ర్యాలీ నిర్వహించి నినాదాలుచ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైద్యాధికారి వెంకటరమణ, ఐసిటిసి కౌన్సిలర్ పుష్పారావు, ల్యాబ్ టెక్నీషియన్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలి: హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణపై సీనియర్ సివిల్ జడ్జి ఎల్.అరుణశ్రీ, సి.హెచ్.సి సూపరింటెండెంట్ గేదెల శశిభూషనరావు, వైద్యులు, సిబ్బంది ర్యాలీ చేశారు. హెచ్.ఐ.వి, ఎయిడ్స్ నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని వైద్యులను అరుణశ్రీ కోరారు. హెచ్.ఐ.వి, ఎయిడ్స్ రోగులు పట్ల వివక్షత చూపవద్దని ఆమె కోరారు. ర్యాలీలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



బొబ్బిలిలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న విద్యార్థినులు

కొవ్వొత్తులతో నివాళులు

ఎయిడ్స్ నియంత్రణ అవగాహనతోనే సాధ్యమని, యువత హెచ్‌ఐవిపై అవగాన పెంపొందించుకోవాలని రోటరీ జిల్లా అధ్యక్షులు జెసి రాజు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం స్థానిక బాలికల వసతి గృహంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని అధ్యక్షులు సింద్రీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వసతిగృహ విద్యార్థినులు, రోటరీ సభ్యులు ఎయిడ్స్ వ్యాధి వల్ల అసువులు బాసిన వారికి కొవ్వొత్తులతో నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పూర్వ అధ్యక్షులు జి. శ్రీనివాసరావు, పూర్వ కార్యదర్శి శ్రీహరి, కె.రామకృష్ణ, కృష్ణమోహన్, వసతిగృహ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.